క్లుప్తంగా

సెల్‌ఫోన్ల అప్పగింత

కెరమెరి: బాధితులు ఇటీవల పోగొట్టుకున్న రెండు సెల్‌ఫోన్లను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి సోమవారం అప్పగించినట్లు ఎస్సై మధుకర్ తెలిపారు. మండలంలోని ముజయింద్ ఖాన్‌కు చెందిన రూ.28 వేలు, వాసంత్‌రావుకు చెందిన రూ.10 వేల విలువైన సెల్‌ఫోన్‌లను పోలీస్ స్టేషన్‌లో అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆర్థిక సాయం

పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడ గ్రామానికి చెందిన తుమ్మిడే రాజశేఖర్ ఇటీవల ఆత్మహత్యకు పాల్పడగా బాధిత కుటుంబానికి సోమవారం గజ్జెల సురేశ్, షేక్ ఇస్మాయిల్‌లు రూ. 25వేలు ఆర్థిక సాయం అందచేశారు. వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి తమ వంతుగా ఎల్లవేళల సహయ సహకారాలు అందిస్తామన్నారు. మాజీ సర్పంచులు సుధాకర్, శ్రీనివాస్, సంజీవ్, సాజిద్, చౌదరి తిరుపతి, బండన్న, వెంకన్న, మారన్న, తాజ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న బీజేపీ నాయకులు

కాగజ్‌నగర్ టౌన్: సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బీజేపీ పట్టణ అధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఆదివారం పంపిణీ చేశారు. పట్టణంలోని నౌగాం బస్తీ, ఓల్డ్ కాలనీ, న్యూకాలలోని రాచర్ల జయలక్ష్మి, తాలిబు సిన, పెస్త తరుణం, మామిండ్ల మురళీ, దూరం చంద్రకళ లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు వలపదాసు శ్రీదేవి, గుప్త వెంకటేశ్, రాజ్‌కుమార్, ప్రశాంత్, కార్తీక్ పాల్గొన్నారు.

108లో ప్రసవం

కౌటాల: చింతలమానెపల్లి మండలం బాలాజీ అనుకోడ గ్రామానికి చెందిన గర్భిణి నక్క కృష్ణవేణికి ఆదివారం రాత్రి పురుటి నొప్పులు రావడంతో 108కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో కాగజ్‌నగర్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో కోసిని గ్రామ సమీపంలో పురిటి నొప్పులు అధికం కావడంతో ఈఎంటీ సాగర్, పైలట్ సునీల్ ప్రసవం చేశారు. అనంతరం కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు.

ట్యాక్స్ ప్రొఫెషనల్స్ కార్యవర్గం ఎన్నిక

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు సంబంధించిన ట్యాక్స్ ప్రొఫెషనల్స్ కమిటీని సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మహేందర్ ఉపాధ్యాయ్, ఉపాధ్యక్షులుగా రితేష్ దాలియా, వడ్డెపల్లి సుభాష్, కార్యదర్శి గా శ్రీధర్, సంయుక్త కార్యదర్శులుగా కార్తీక్, రాజేంద్ర లాహూటి, కోశాధికారిగా గడ్డం అనీల్, కార్యనిర్వాహక సభ్యులుగా శ్రీనివాస్, మహ్మద్ మున్వర్, ఉద్దిన్, భువనేశ్వర్, శ్రీనివాస్‌యాదవ్, ప్రసాద్ ఎన్నికయ్యారు.

వారధి లేక అవస్థలు

- కుష్ణపల్లి, సోమిని గ్రామాల్లో కలగానే వంతెనల నిర్మాణం
- 2014లో మంజూరైన నిధులు
- అటవీ అనుమతుల కారణంగా చేపట్టని పనులు



బురదమయంగా రోడ్డు

బెజ్జూర్: వర్షాకాలం ప్రారంభమైతే చాలు గిరి గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటు గడపాల్సి వస్తోంది. మండలంలోని సోమిని, కుష్ణపల్లి గ్రామాల మధ్య వంతెన నిర్మాణాలు చేపట్టకపోవడంతో వాగులు ఉప్పొంగి అవస్థలు పడుతున్నారు. అత్యవసర సమయంలో గ్రామాలకు 108 అంబులెన్స్‌లు రాకపోగా, పురుటి నొప్పులతో గర్భిణులు వాగులు దాటలేక, ప్రాణాలు వదిలిన ఘటనలు కూడా ఉన్నాయి. వంతెన నిర్మాణం కోసం 2014లో నిధులు మంజూరైనప్పటికీ అటవీశాఖ అనుమతుల పేరుతో పనులు నిలిచిపోయాయి. అధికారంలోకి వచ్చినా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిధులను సైతం వెనక్కి మళ్లించడంతో ప్రజలు ఆశలపై నీళ్లు చల్లినట్లు అయింది. వాగులు ఉప్పొంగిన సమయంలో బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండాల్సిన దుస్థితి.

వంతెనలు లేక..

మండలంలోని కుష్ణపల్లి, సోమిని గ్రామాల మధ్య లోలెవల్, హైలెవల్ వంతెనలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆయా గ్రామాల మధ్య వంతెనల నిర్మాణానికి ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద 2014లో సమీపంలో రూ.215 కోట్లు, కుష్ణపల్లి సమీపంలో వంతెన కోసం రూ.2.19కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే ఈ వంతెనల నిర్మాణానికి అటవీ అనుమతులు లేవన్న కారణంతో పనులు నిలిచిపోయాయి. ఇప్పటికే వర్షాలు ప్రారంభం కావడంతో ఇక తమ కష్టాలు కూడా మొదలైనట్టేనని గిరి గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దేవుడిపైనే భారం..

వర్షాకాలంలో ఆయా గ్రామాల ప్రజలు దేవుడిపై భారం వేసి రాకపోకలు సాగించాల్సి వస్తోంది. గర్భిణులు వాగు దాటేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వాగులపై వంతెనలు నిర్మించకపోవడంతో ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వర్షాకాలంలో ఆ గ్రామాలకు వెళ్లేందుకు అవస్థలు తప్పడం లేదు. కనీసం 108 అంబులెన్స్ వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షాకాలం తప్పని తిప్పలు



ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో రోడ్లు, వంతెనలు లేకపోవడంతో అవస్థలు పడుతున్నాం. కనీసం వర్షాకాలంలో 108 వాహనం సైతం మా గ్రామాలకు వచ్చే పరిస్థితి లేదు. అత్యవసర సమయాల్లో వైద్యం అందక మృత్యువాత పడ్డ సంఘటనలు సైతం ఉన్నాయి.

– సడమేక రమేశ్, గిన్నెగూడ

సమస్యలు పరిష్కరించాలి



మారుమూల గ్రామాల రోడ్లు, వంతెనలతో నిర్మాణాలకు నిధులు మంజూరైనప్పుడు సంతోషించాం. అయినా అటవీశాఖ అనుమతులు లేని కారణంగా నిధులు వెనక్కి పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

– కొడుప సత్యవన్, నాగేపల్లి

ప్రమాదకర ప్రయాణం



కంకర తేలిన పంగిడిమాదర నుంచి లింగాపూర్ వెళ్లే రోడ్డు

- అధ్వానంగా పంగిడిమాదర – లింగాపూర్ రోడ్డు
- జోరుగా ఇసుక ట్రాక్టర్ల రాకపోకలు
- 'మామూలు'గా తీసుకుంటున్న అధికారులు

తిర్యాణి: అసలే అంతంత మాత్రంగా ఉన్న రోడ్లపై అధిక లోడుతో ఇసుక ట్రాక్టర్లు నడుస్తుండటంతో అధ్వానంగా మారుతున్నాయి. మండలంలో 29 గ్రామ పంచాయతీలుండగా 134 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. కాగా కనీస రోడ్డు సౌకర్యం లేని గ్రామాలు 40 శాతంకు పైగా ఉన్నాయి. అంతంత మాత్రంగా ఉన్న రోడ్లపై అక్రమార్కులు అధిక లోడు అక్రమ రవాణా చేస్తుండటంతో అవి సైతం పూర్తిగా చెడిపోతున్నాయి. అయినప్పటికీ అక్రమ రవాణపై అధికారులు 'మామూలు'గా తీసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధ్వానంగా ప్రధాన రహదారి..

జిల్లాలోని లింగాపూర్, సిర్పూర్(యూ), జైనూర్ మండలాల్లో ఇసుక నిల్వలు తక్కువగా ఉండటంతో అక్కడి వ్యక్తులు ఆసిఫాబాద్ మండలం చిర్రకుంటలోని వాగు నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా పంగిడిమాదర మీదుగా లింగాపూర్ తరలిస్తున్నారు. పంగిడిమాదర–లింగాపూర్ ప్రధాన రహదారి తారు లేచి ఉండడం, దీనికి తోడు రోజుకు 20 నుంచి 50 ట్రాక్టర్లు నడుస్తుండటంతో రోడ్డు అధ్వానంగా మారింది. కొంతమంది ట్రాక్టర్ యాజమానులు ఎలాంటి అనుమతి లేకుండానే ఇసుక రవాణా చేస్తున్నట్లు సమాచారం. దీంతో పంగిడిమాదర నుంచి దాంపూర్, కౌటగాం, లింగాపూర్, సిర్పూర్(యు) గ్రామాలకు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు అదుపుతప్పి కిందపడడంతో గాయాలైన సంఘటనలు సైతం అనేకం ఉన్నాయి. రాత్రిపూట ఈ రోడ్డుపై ప్రయాణించడం సాహసమనే చెప్పుకోవచ్చు. అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా నడిచే పరిస్థితి లేకపోవడంతో ఆదివాసీలకు రోడ్డు కష్టాలు తప్పడం లేదు.

చర్యలు చేపట్టాలి



ఆసిఫాబాద్ మండలంలోని చిర్రకుంట వాగు నుంచి ఇసుకను పంగిడిమాదర మీదుగా లింగాపూర్ తీసుకుని పోకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక ట్రాక్టర్లు నడుస్తుండటంతో రోడ్డు పూర్తిగా పాడైంది. తిర్యాణి నుంచి పంగిడిమాదర మీదుగా లింగాపూర్ కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లడంలేదు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి.

– తురం గోపాల్, మాజీ సర్పంచ్, ఉమ్మడి పంగిడిమాదర జీపీ

పేదల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం



భూమిపూజ చేస్తున్న అధికారులు, నాయకులు

కౌటాల: పేదల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నికోడే గంగారాం అన్నారు. సోమవారం మండలంలోని గురుడుపేట్, బోదంపల్లి, తలోడి, కన్నెపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించి ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమాల్లో ఎంపీవో మహేందర్‌రెడ్డి, కార్యదర్శులు సాయికృష్ణ, రమేశ్, సునీత, రమేశ్, భీంరావు, బ్రహ్మయ్య, వసంత్, కోటేశ్వర్, చంద్రశేఖర్, పోశం, శంకర్ పాల్గొన్నారు.

'మంత్రి సీతక్కను విమర్శించే స్థాయి కాదు'

చింతలమానెపల్లి: మంత్రి సీతక్కను విమర్శించే స్థాయి రావి శ్రీనివాస్‌కు లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉమా మహేశ్ అన్నారు. సోమవారం మండలంలోని రుద్రాపూర్ గ్రామంలో మాట్లాడారు. సీతక్క అనేక పోరాటాలు చేసి మంత్రి స్థాయికి ఎదిగారన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సంక్షేమం కోసం పాటు పడుతారన్నారు. ఆదివాసీ మహిళ మంత్రిగా సమర్థవంతంగా పని చేస్తున్న సీతక్కపై విమర్శలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొండు శంకర్, జునుగరి శేఖర్, పొలాజీ రాజు, పెరుగు వందన, మేకల జనార్దన్, కొట్రంగి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బెజ్జూర్: మంత్రి సీతక్కపై అసత్యపు ఆరోపణలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, కోడుప విశ్వేశ్వర్, మాజీ సర్పంచ్ కొండ్ర జగ్గా గౌడ్, పెద్దల సుగుణలు మాట్లాడారు. సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌ను ఆరు సంవత్సరాలు సస్పెన్షన్ చేసిన కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఇష్టారాజ్యంగా ఆదివాసీ మంత్రి సీతక్కపై నిందలు వేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

ఉద్యోగులకు విరమణ సహజం

ఆసిఫాబాద్‌అర్బన్: ఉద్యోగులకు విరమణ అనేది సహజమని ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ఏడీసీగా పనిచేస్తున్న శ్రీమంతుల చంద్రశేఖర్, డ్రైవర్లు మహబూబ్, మోహినొద్దీన్, కండక్టర్ శ్రీనివాస్ ఉద్యోగ విరమణ పొందగా పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిపో సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎంఎఫ్ ఉదయ్, టీఐ 3 నిర్మల, ఉదయ్‌బాబు, మంథెన మహేష్, రాజేందర్, డిపో కార్మికులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ టౌన్: ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని ఏడీఏ మనోహర్ అన్నారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన దాసరి సరోజను శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లకు పైగా వ్యవసాయ శాఖలో సరోజ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏవో రామకృష్ణ, డివిజన్ పరిధిలోని ఏఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

'రైతులను మోసం చేస్తున్న 'హాకా' నిర్వాహకులు'



మాట్లాడుతున్న తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు విజయ్

కెరమెరి: హాకా కేంద్రాల నిర్వాహకులు ఏజెన్సీ ప్రాంత రైతులను మోసం చేస్తున్నారని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ ఆరోపించారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి రాయితీపై వస్తున్న యూరియా, డీఏపీ ఎరువులను ప్రైవేట్ షాపులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని అన్నారు. రైతులు మాత్రం స్టాక్ లేదని చెప్పడం పరిపాటిగా మారిందన్నారు. వ్యవసాయ కమిటీల తీర్మానం లేకుండా గిరిజన ప్రాంతాల్లో డీలర్లు షాపులు నిర్వహిస్తున్నారని తెలిపారు. అక్రమాలకు పాల్పడుతున్న షాపులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్, తుకారం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి

చింతలమానెపల్లి: ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి జయరాజ్ అన్నారు. గత కొద్ది నెలలుగా మూతపడి ఉన్న రవీంద్రనగర్- 2 ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు చేరడంతో సోమవారం ఎంపీడీవో సుధాకర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తారన్నారు. ఉచిత దుస్తులు, ఉచిత పుస్తకాలు, ఉచిత భోజనం అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పెద్దులు, సుదర్శన్, అంగన్‌వాడీలు, సీఆర్పీ మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

జీవో 49 రద్దు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దహెగాం: కుమురం భీం జిల్లాను కన్జర్వేషన్ రిజర్వ్ పేరిట తీసుకొచ్చిన 49 జీవోను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు దిగిడె బక్కన్న అన్నారు. సోమవారం తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మునవార్ షరీఫ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గిరిజన గ్రామాల ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండానే జీవో తీసుకురావడం సరికాదన్నారు. జీవోను రద్దు చేసే వరకు ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో టీఏజీఎస్ మండల కార్యదర్శి నల్లి దామోదర్, కమిటీ సభ్యులు శేగం కమల, దూల లక్ష్మి, నరసింహులు, రజిత, తారాబాయి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే సకల సౌకర్యాలు

కెరమెరి: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించబడుతాయని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. మండలంలోని గోయగాం ప్రాథమిక పాఠశాలలో సోమవారం ప్రీప్రైమరీ పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు కూడ ఇక్కడ చదువుకునే వెలుసువాటు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో రూ.5 వేలు, సావర్‌ఖెడా హెచ్‌ఎం కడేర్ల రంగయ్య రూ.5వేలు, పాఠశాల హెచ్‌ఎం రవితేజ నెల కు 2 వేలు చొప్పున రూ. 24 వేలు, విజయ్ ఐడెంటీకార్డులు, సుధాకర్ బ్యాగులు అందించగా సునీల్ నెలకు 50 కేజీల బియ్యం అందజేస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంఈవో ఆడే ప్రకాశ్, కడేర్ల రంగయ్య దంపతులను సత్కరించారు.

బెల్టుషాపులపై విచారణ

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని చింతగూడ గ్రామంలోని బెల్టుషాపులపై అడిషనల్ కలెక్టర్ డేవిడ్ ఆదేశాల మేరకు సోమవారం ఎక్సైజ్ అధికారులు విచా రణ చేపట్టారు. బెల్టుషాపులు నిర్వహించవద్ద ని, బెల్టుషాపులు ఉన్న ప్రాంతాలను తనిఖీ చేయడంతో పాటు బెల్టుషాపులు నిర్వహిస్తు న్న వారి వివరాలను సేకరించి వారికి ముందస్తుగా హెచ్చరికలు జారీ చేశారు. బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గుడుంబాతో పాటు బెల్టుషాపులు నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలని ఎక్సైజ్ సీఐ రవి కుమార్ సూచించారు.

ఇందిరమ్మ ఇళ్లు సద్వినియోగం చేసుకోవాలి



భూమిపూజ చేస్తున్న అధికారులు

చింతలమానెపల్లి: ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సుధాకర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రం చింతలమానెపల్లి, రుద్రాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేసి, పనులు ప్రారంభించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించాలని లబ్ధిదారులకు సూచించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుల్కరి ఉమా మహేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. హౌసింగ్ ఏఈ సాహిల్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం



హోంగార్డులకు రెయిన్ కోట్స్ అందిస్తున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్‌రూరల్: బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదులు స్వీకరించారు. సంబంధిత సర్కిల్ సీఐలకు ఫోన్ చేసి తక్షణం పరిష్కరించాలని సూచించారు. అలాగే ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన గణేశ్ రాథోడ్ కుటుంబ సభ్యులకు భద్రత ఎక్స్‌గ్రేషియా కింద మంజూరైన రూ.8లక్షలు, కార్పస్ ఫండ్ కింద రూ.1.9లక్షల విలువైన చెక్కులు అందించారు. పోలీసు కుటుంబాల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ రాణాప్రతాప్, జిల్లా పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు విజయ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డులకు రెయిన్ కోట్స్ అందజేత

జిల్లా కేంద్రంలో సోమవారం ఎస్పీ కాంతిలాల్ పాటిల్ పోలీసుశాఖలో పనిచేస్తున్న హోంగార్డులకు రెయిన్ కోట్స్ అందించారు. ఆయన మాట్లాడుతూ పోలీసులతోపాటు హోంగార్డులు నిరంతరం సేవలందిస్తున్నారని అన్నారు. సమస్యలు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో హోంగార్డ్ ఆర్ఐ విద్యాసాగర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ రాణాప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.


'ఇందిరమ్మ' కేటాయింపులో అక్రమాలు



వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

ఆసిఫాబాద్: వాంకిడి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపిస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎలగతి సుచిత్ మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలను విస్మరించి కాంగ్రెస్ నాయకులు వారి బంధువులకు ఇప్పించారన్నారు. దీనిపై ఎంపీడీవో, పంచాయతి కార్యదర్శులను సంప్రదించగా కాంగ్రెస్ నాయకులు సూచించిన వారికి ఇండ్లు కేటాయించినట్లు తెలిపారన్నారు. దీనిపై కమిటీ వేసి విచారణ జరిపించాలని కోరారు. కార్యక్రమంలో వాంకిడి బీజేపీ మండల అధ్యక్షుడు చీదర్ల నరేశ్, సింగిల్ విండో డైరెక్టర్ దేవేగి గొల్ల, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులు డబ్బులు పొదుపు చేయాలి



సన్మానిస్తున్న జీఎం విజయ భాస్కర్‌రెడ్డి

రెబ్బెన: సుదీర్ఘకాలం పాటు సంస్థలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందుతున్న కార్మికులు సంస్థ అందించే టర్మినల్ బెనిఫిట్స్‌ను పొదుపు చేసుకోవాలని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్ రెడ్డి అన్నారు. గోలేటి టౌన్‌షిప్ లోని జీఎం కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందుతున్న జనరల్ అసిస్టెంట్ చెల్ల లక్ష్మిని సోమవారం ఏరియా జనరల్ మేనేజర్ ఏరియా అధికారులతో కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం కే. రాజమల్లు, అధికారుల సంఘం నాయకులు ఉజ్వల్‌కుమార్ బెహారా, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, డీవైపీఎం ఎస్‌వీ రాజేశ్వర్‌రావు, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, సీనియర్ అకౌంట్స్ అధికారి వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ నాయకురాలు శైలజ తదితరులు పాల్గొన్నారు.

కైరిగూడ, ఏరియా వర్క్‌షాపులలో..

బెల్లంపల్లి ఏరియాలోని ఏరియా వర్క్‌షాప్‌లో జనరల్ అసిస్టెంట్‌గా పనిచేసి పదవీ విరమణ పొందుతున్న ములకల చంద్రయ్య దంపతులను టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు సన్మానించారు. కైరిగూడ ఓసీపీలో సలాడి రాజలింగును ఏఐటీయూసీ నాయకులు సన్మాంచారు.

సెప్టిక్ ట్యాంకులో దిగబడిన ఆర్టీసీ బస్సు



ఇరుక్కుపోయిన ఆర్టీసీ బస్సు

రెబ్బెన: మండల కేంద్రంలోని ఆసిఫాబాద్ రైల్వేస్టేషన్ ఆవరణలో సోమవారం సెప్టిక్ ట్యాంకు స్లాబ్ పగిలి ఆర్టీసీ బస్సు దిగబడింది. వివరాల్లోకి వెళితే ఆసిఫాబాద్ డిపోకు చెందిన బస్సు ఆసిఫాబాద్ రోడ్ రైల్వేస్టేషన్ భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌లో వచ్చే ప్రయాణికులను ఆసిఫాబాద్‌కు తీసుకువెళ్లేందుకు రాగా స్టేషన్ ఆవరణలో బస్సును మలుపు తిప్పే క్రమంలో డ్రైవర్ చూసుకోకుండా సెప్టిక్ ట్యాంకు పైకి ఎక్కించాడు. అయితే ట్యాంకు పైకప్పు నాసిరకంగా ఉండడంతో ఒక్కసారిగా స్లాబ్ పగిలి బస్సు ముందు చక్రం ఇరుక్కుపోయింది. బస్సులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. స్థానికులు జేసీబీ సాయంతో బయటకు లాగారు. ఆసిఫాబాద్‌కు వెళ్లేందుకు ప్రయాణికులు సుమారు గంట పాటు జాతీయ రహదారిపై నిరీక్షించారు.